

తొమ్మిది మంది సీఐల బదిలీ

సంగారెడ్డి క్రైం, జూలై 26 : సంగారెడ్డి జిల్లాలో 9మంది సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు బదిలీ అయ్యారు. సంగారెడ్డి మహిళా పోలీస్‌స్టేషన్ నుంచి బి.పరమేశ్వర్ గౌడ్ కొండాపూర్ పోలీస్‌స్టేషన్‌కు, ఇక్కడి నుంచి ఎస్.చంద్రయ్య ఐజీ మల్టీ జోన్-2 కార్యాలయానికి, వికారాబాద్ వెయిటింగ్ నుంచి జె.హనుమంతు జహీరాబాద్ రూరల్‌కు, ఇక్కడి నుంచి ఎండీ నయీమొద్దీన్ ఐజీపీ కార్యాలయానికి, రాచకొండ వెయిటింగ్ నుంచి ఎస్.శ్రీనివాస్‌రెడ్డి సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు, ఇక్కడి నుంచి ఎస్.భాస్కర్ ఐజీపీ కార్యాలయానికి, సంగారెడ్డి డీఎస్‌బీ నుంచి ఎస్.శివలింగం జహీరాబాద్ టౌన్‌కు బదిలీ అయ్యారు.

దుర్గమ్మ జాతరలో జగ్గారెడ్డి

పోతరాజులతో కలిసి జగ్గారెడ్డి విన్యాసం

పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు



సంగారెడ్డిలోని తాళ్లపల్లి గౌని దుర్గమ్మ ఆలయంలో సతీమణి, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలకు బొట్టు పెడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



పోతరాజులతో కలిసి విన్యాసం చేస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 26: సంగారెడ్డిలోని తాళ్లపల్లి రోడ్డులో ఉన్న దుర్గమ్మ ఆలయ జాతర ఉత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతీ సంవత్సరం ఆషాడమాసంలో జరిగే దుర్గమ్మ ఉత్సవాలకు సంగారెడ్డి పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవాల్లో పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. జాతరలో పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డితో కరచలనం చేసేందుకు ప్రజలు పోటీ పడ్డారు. జగ్గారెడ్డి చెర్నకోల చేతబట్టి పోతరాజులతో కలిసి విన్యాసం చేస్తూ అందరినీ అలరించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లకాలం ఉండాలని ఆకాంక్షించారు. అనాదిగా అంగరంగ వైభవంగా సాగుతున్న దుర్గమ్మ జాతరను ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగిస్తామని తెలిపారు.

'రుణమాఫీ.. ఫ్యాక్టరీపాలు'పై కదలిక

- రైతులతో సమావేశమైన అధికారులు
- బ్యాంకులో జమ చేస్తాం : ఫ్యాక్టరీ యాజమాన్యం
- నేరుగా మా ఖాతాల్లోనే వేయాలి : రైతులు



రైతులతోమాట్లాడుతున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మనూరు, జూలై 26: రైతుల పేరిట చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యం బ్యాంకు రుణాలు తీసుకుని రుణమాఫీ లబ్ధిపొందిన ఘటనపై అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. 'రుణమాఫీ.. ఫ్యాక్టరీ పాలు..' అనే శీర్షికతో ఈ నెల 24న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సంగారెడ్డి కలెక్టర్ స్పందించారు. మనూరు మండలం అతిమ్యాల్ గ్రామాన్ని జిల్లా వ్యవసాయాధికారి అంబికాసోని, నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ సమావేశమయ్యారు. రైతులు మాట్లాడుతూ మాగి చక్కెర కర్మాగారానికి తాము పండించిన చెరకును విక్రయించడానికి అగ్రిమెంట్ చేస్తూ అందుకు అవసరమైన పత్రాలను అందజేశామని చెప్పారు. ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం ఆ వివరాలతో తమకు తెలియకుండా తమ పేర్ల మీద బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నదని చెప్పారు. ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో.. లోన్లు మాఫీ అయినట్టు తమ ఫోన్లకు మెసేజ్‌లు రావడంతో అవాక్కయ్యామన్నారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి'కి తెలుపడంతో వెలుగులోకి వచ్చిందని తెలిపారు. తమ పేరిట రుణాలు తీసుకున్న మొత్తాన్ని ఫ్యాక్టరీ యాజమాన్యం తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా, చక్కెర ఫ్యాక్టరీ అధికారులు మాట్లాడుతూ రుణమాఫీని రైతుల బ్యాంకుల ఖాతాల్లో జమ చేస్తామని తెలుపగా రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నేరుగా తమ ఖాతాల్లోనే జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏవోలు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశం, అతిమ్యాల్, తోర్నాల్, ఎల్గోయి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డలను కలిపిన 'ఆధార్'

చిన్నతనంలో తప్పిపోయిన మానసిక దివ్యాంగులు

పదేళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు..



తల్లిదండ్రులతో రాజు, ఇమ్మానియేల్

శివ్వంపేట, జూలై 26 : మానసిక స్థితి సరిగ్గా లేని ముగ్గురు బాలురు.. వారిలో ఇద్దరు సోదరులు 12 సంవత్సరాల క్రితం, మరో బాలుడు తొమ్మిదేళ్ల క్రితం తప్పి పోయారు. ముగ్గురూ మెదక్ జిల్లా శివ్వంపేట మండలం మగ్దుంపూర్ గ్రామంలో సజీవర్గీస్ నెలకొల్పిన బేతాని సంరక్షణ అనాధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్నారు. వారికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయించేందుకు ఆశ్రమ నిర్వాహకులు తీసుకెళ్లిన క్రమంలో వారి కుటుంబ వివరాలు తెలిశాయి. తమ బిడ్డలు క్షేమంగా ఉన్నారని తెలుసుకుని ఆనందంతో తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

గుంటూరు జిల్లా నరసరావుపేట మండలం కోటప్పకొండ గ్రామానికి చెందిన దాసరి నాగేంద్ర, శీను దంపతులు ఎల్బీనగర్‌లో ఉంటూ వెంట్రుకల వ్యాపారం చేస్తుంటారు. వారికి ఇద్దరు మానసిక దివ్యాంగులైన కుమారులు రాజు (13), ఇమ్మానియేల్ (9) ఉన్నారు. 12 ఏళ్ల క్రితం ఓరోజు పెద్ద కొడుకు మారం చేస్తుండటంతో తల్లి డబ్బులు ఇచ్చి కిరాణా షాపులో చాక్లెట్లు కొనుక్కోమని ఇద్దరు బిడ్డలను పంపించింది. అప్పుడు నుంచి తప్పిపోయిన రాజు, ఇమాన్యుల్ అటూఇటు తిరిగి బేతాని సంరక్షణ ఆశ్రమానికి చేరారు. అప్పటి నుంచి అక్కడే



తల్లిదండ్రులతో మానసిక దివ్యాంగుడు శేఖర్

ఉంటున్నారు. ఇక కరీంనగర్ జిల్లా కొడిమ్యాల మండలం దమ్మాయిపేట గ్రామానికి చెందిన మల్లయ్య, లక్ష్మిలు తమ పెద్ద కుమారుడు రోడ్డు ప్రమాదంలో చేయి కోల్పోవడంతో వేములవాడ ఆస్పతికి వచ్చారు. వారి రెండో కుమారుడు శేఖర్ (13) కూడా వారితో వచ్చారు. అతని మానసిక స్థితి సరిగ్గా ఉండదు. వేములవాడలో తప్పిపోయిన శేఖర్ హైదరాబాద్ నగరానికి చేరగా, పోలీసులు బేతాని సంరక్షణ ఆశ్రమానికి చేర్చారు. అయితే, మానసిక దివ్యాంగుల పథకం పొందేందుకు ఐదేళ్ల క్రితం ఆశ్రమ నిర్వాహకులు వారి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయించాలని ప్రయత్నించారు. అయితే, ఆధార్ రిజక్ట్ అయింది. ఆరా తీయగా, వారి పేరిట ఎక్కడో ఆధార్ నమోదై ఉన్నట్లు తేలింది. అప్పటి నుంచి వీరి ఆచూకీ కోసం ప్రయత్నించగా, చిట్టచివరికి తల్లిదండ్రుల చిరునామా దొరికింది. వారికి సమాచారం ఇవ్వగా వారు శుక్రవారం ఆశ్రమానికి వచ్చి తమ బిడ్డలను అక్కున చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ వీరబాబు, ఆశ్రమం క్యాంప్ ఇన్‌చార్జి విన్సెంట్, సిస్టర్ కార్మెల్ ఉన్నారు.

'తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రిలో పది రోజుల క్రితం వరకు నిత్యం 370 మంది అవుట్ పేషెంట్లు వచ్చేవారు. ప్రస్తుతం ఈ సంఖ్య 460కి చేరింది. వీరిలో 17 మంది ఆస్పత్రిలో చేరాల్సి వచ్చింది. విషజ్వరాలు, వాంతులు, కీళ్లనొప్పులతో బాధపడుతున్నారు. పది రోజుల్లోనే దాదాపు ఆస్పత్రికి వచ్చేవారి సంఖ్య 25 శాతం పెరిగింది. విషజ్వరాలు, సీజనల్ వ్యాధుల బారినపడి జనాలు ఆస్పత్రికి క్యూ కడుతున్నారు.'

'సంగారెడ్డి పట్టణంలోని రిక్షా కాలనీలోని బస్తీ దవాఖానా ఉదయం 9 గంటలకు తెరుచుకోవాలి. కానీ, 10 గంటలైనా డాక్టర్లు, సిబ్బంది రాలేదు.. ఆస్పత్రి తెరవలేదు. గతవారమే కలెక్టర్ వల్లూరు క్రాంతి ఈ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. వారం తిరగకుండానే ఆస్పత్రి సిబ్బంది కలెక్టర్ సూచలను మర్చిపోయారు. షరామామూలుగా వ్యవహరించారు.'



సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జర్వ బాధితులు

పల్లెకు సుస్తీ..

రోగులతో ఆస్పత్రులు కిటకిట

ప్రబలుతున్న డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా

వాంతులు, విరేచనాలు, కీళ్లనొప్పుల బాధలు

కలెక్టర్ తనిఖీ చేసినా మారని ఆస్పత్రులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 26: వానాకాలం అంటేనే వ్యాధుల సీజన్.. అపరిశుభ్ర పరిసరాలు.. దోమల వ్యాప్తి కారణంగా రోగాలు విజృంభిస్తుంటాయి. ఇటీవల విడువకుండా కురుస్తున్న వర్షాలకు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో డయేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాల ఉధృతి పెరుగుతున్నట్లు తెలుస్తున్నది. ఆస్పత్రులకు వచ్చేవారి సంఖ్య పెరుగుతుండడమే ఇందుకు నిదర్శనం. రెండు జిల్లాల్లోని ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరుగుతున్నది. ఔట్‌పేషెంట్లే కాకుండా ఆస్పత్రుల్లో చేరే అవసరం వస్తున్నవారి సంఖ్య కూడా పెరుగుతున్నది. ఓవైపు వ్యాధులు విజృంభిస్తుంటే అప్రమత్తంగా ఉంటూ మెరుగైన సేవలందించాల్సిన వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పనితీరుపై కొన్నిచోట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితిపై శుక్రవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన పరిశీలనలో పలు విషయాలు బహిర్గతమయ్యాయి.

డెంగ్యూ 70 .. టైఫాయిడ్ 357 కేసులు

సంగారెడ్డి జిల్లాలో 67 మందికి డెంగ్యూ, 243 మందికి టైఫాయిడ్ జ్వరం, మెదక్ జిల్లాలో ముగ్గురికి డెంగ్యూ 114 మందికి టైఫాయిడ్ సోకినట్లుగా నిర్ధారించారు. వానాకాలం సీజన్ మొదలైన రెండు నెలల వ్యవధిలోనే విషజ్వరాలు విజృంభించడం ఆందోళనను కలిగిస్తోంది. ఇటీవల రామాయంపేట మండలం సుతార్‌పల్లిలో దాదాపు 200 మందికి చికన్‌గున్యా లక్షణాలు ఉండడంతో వెనువెంటనే వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నారాయణఖేడ్, జహీరాబాద్, తూప్రాన్, సంగారెడ్డి, జోగిపేట, మెదక్, రామాయంపేట ప్రాంతాల్లో జ్వరబాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా నారాయణఖేడ్ డివిజన్‌లో డయేరియా లక్షణాలున్న రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. మరో రెండునెలల పాటు వర్షాలు కురిసే నేపథ్యంలో ఇంకా వ్యాధుల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

అవగాహన కరువు..

వ్యాధులవ్యాప్తిని నియంత్రించడానికి క్షేత్రస్థాయిలో వైద్యారోగ్యశాఖ అవగాహన కల్పించాల్సి ఉంటుంది. కానీ, వైద్యశాఖ సిబ్బంది ఆ పని చేయకపోగా విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. సంగారెడ్డిలోని బస్తీదవాఖానాలో శుక్రవారం కనిపించిన పరిస్థితే ఇందుకు నిదర్శనం. గత శుక్రవారం సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని బస్తీ దవాఖానను తనిఖీ చేశారు. సిబ్బందిని హెచ్చరించారు. కానీ, వైద్యారోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సదరు ఆస్పత్రిని ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వారం గడవకుండానే ఈ శుక్రవారం ఉదయం 10 గంటలు దాటినా ఆస్పత్రి తలుపు తెరుచుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు జిల్లాల్లోనూ పలుచోట్ల ఇలాంటి పరిస్థితే ఉందని ఆరోపణలున్నాయి. వర్షాకాలంలో పాటించాల్సిన రక్షణ చర్యల గురించి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం లేదనే విమర్శలు నెలకొన్నాయి. వ్యాధులు ప్రబలకముందే ఇంటింటా తగిన సూచనలు ఇవ్వాల్సి ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జ్వరాల తీవ్రతతో జ్వరసర్వే చేపట్టి ముందుకెళ్తున్నారు. ఈ సర్వే కారణంగా జ్వర బాధితులకు అవసరమైన సూచనలతో పాటు ఇతర రోగాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు అందుతాయి. వైద్యారోగ్య శాఖ అధికారులు ఈ సీజన్‌లో చాలా అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది.

కొత్తూర్(బి)లో విషజ్వరాలు

వైద్యశిబిరం ఏర్పాటు

జహీరాబాద్, జూలై 25 : జహీరాబాద్ మండల పరిధిలోని కొత్తూర్(బి) గ్రామంలో వారం రోజులుగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇప్పటివరకు 8 మంది ఆస్పత్రిపాలయ్యారు. దీంతో వైద్యశాఖ అధికారులు స్పందించి రెండ్రోజులుగా గ్రామంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. జ్వర జర్వే నిర్వహించి ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం బాధితులందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యసిబ్బంది చెబుతున్నా ప్రజలు భయంభయంగా ఉన్నారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో గాయత్రీదేవి, వైద్యసిబ్బంది శుక్రవారం గ్రామంలో ఇంటింటికి తిరిగి జ్వర బాధితుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. ఇంకా ఎవరైనా జ్వరాలతో బాధపడుతున్నారా అని ఆరా తీశారు. వైద్యశాఖ సిబ్బంది, గ్రామ అధికారులు, గ్రామస్థులతో కలిసి డ్రైడే కార్యక్రమం చేపట్టారు. పరిశుభ్రత, దోమల నివారణపై అవగాహన కల్పించి ఇళ్లల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపజేశారు. దోమల మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంగారెడ్డి, మాజీ సర్పంచ్ జగన్మోహన్ పాల్గొన్నారు.

పెరుగుతున్న జ్వర పీడితుల సంఖ్య..

- ఝరాసంగం పీహెచ్‌సీలో పదిరోజుల క్రితంతో పోల్చితే దాదాపు వంద మంది జ్వరబాధితుల సంఖ్య పెరిగింది.
- టేక్మాల్ పీహెచ్‌సీలోనూ 30 శాతం ఓపీ పెరిగినట్లుగా వైద్యులు పేర్కొన్నారు.
- నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రిలో డయేరియా బాధితులు ఎక్కువగా వస్తున్నారు.సిబ్బంది కొరత ఉంది.
- నర్సాపూర్ ఆస్పత్రిలోనూ మూడింతల సంఖ్య పెరిగింది.
- చేగుంటలో వంద మంది వరకు పేషెంట్లు రాగా.. ఇందులో ఆరుగురు కుక్కకాటు, ఒకరు పాముకాటు బాధితులు వచ్చారు. మిగితా అందరూ జ్వరంతో బాధపడుతున్నవారే. ఆస్పత్రి చుట్టూ పిచ్చిమొక్కలు ఉన్నాయి. ఇక్కడ ఫార్మసిస్టు పోస్టు ఖాళీగా ఉంది.
- కంగ్టి పీహెచ్‌సీలో దగ్గు, జ్వరం, డయేరియా, వాంతులు, విరేచనాల బాధతో రోగులు వస్తున్నారు. ఓపీ సంఖ్య వారం రోజుల్లోనే 133 నుండి 162కు చేరింది.
- పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రిలో పది రోజుల క్రితం 250 ఉన్న పేషెంట్ల సంఖ్య ప్రస్తుతం 450 దాటుతున్నది.
- ఆర్సీపురం పరిధిలో విషజ్వరాల ప్రభావం ఎక్కువగా ఉంది. రెండు డెంగ్యూ కేసులు నమోదయ్యాయి.
- సంగారెడ్డి జిల్లా ఆస్పత్రిలో వైరల్ ఫీవర్, వాంతులు, విరేచనాలతో రోగులు వస్తున్నారు. శుక్రవారం ఓపీ సంఖ్య 1500 నమోదుకావడం గమనార్హం.



తెరచుకోని సంగారెడ్డిలోని రిక్షా కాలనీ బస్తీదవాఖాన



జోగిపేటలో ఓపీ వద్ద గుమిగూడిన రోగులు



తూప్రాన్ రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు



కొత్తూర్(బి)లో ప్రజలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

రైతుబీమాకు కార్యాచరణ

కొత్త మార్గదర్శకాలు జారీ

జూన్ 28 లోపు పట్టా పొందితేనే వర్తింపు

జిల్లాలో 14,495 మందికి కొత్తగా అర్హత

దరఖాస్తులకు ఆగస్టు 5 వరకు గడువు


రైతుబీమా RYTHU BIMA FARMER'S INSURANCE

మెదక్, జూలై 26 : రైతు బీమాను పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించింది. ఇప్పటికే రైతు బీమా వర్తిస్తున్న రైతుల వయో పరిమితి 59 సంవత్సరాలు దాటితే వారిని బీమా పరిధి నుంచి తొలగిస్తారు. జూన్ 28వ తేదీ లోపు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన వారికి కూడా బీమా సౌకర్యం కల్పిస్తూ మార్గదర్శకాలు రూపొందించారు. ఇప్పటికే కొత్తగా పట్టాలు పొందినవారి జాబితాను వ్యవసాయాధికారులు ప్రకటించారు. వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇందుకోసం వ్యవసాయ విస్తీర్ణాధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆధార్‌కార్డులో తప్పులుంటే సరిదిద్దుకునేందుకు అవకాశం ఇస్తున్నారు. ఆగస్టు 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవడానికి తుది గడువుగా నిర్ణయించారు. 1964 నుంచి 2005 ఆగస్టు 14 వరకు జన్మించిన రైతులకు మాత్రమే బీమా వర్తించనుంది. బీమా పొందిన రైతులు ఏ కారణం చేతనైనా మరణిస్తే కుటుంబానికి రూ.5 లక్షల బీమా వర్తిస్తుంది.

మెదక్ జిల్లాలో 2,86,263 మందికి..

మెదక్ జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 1,72,539 మంది రైతులకు బీమా పథకం వర్తిస్తున్నది. ఈ ఏడాది కొత్తగా పట్టాదార్ పాసు పుస్తకం పొందిన వారు మరో 14,495 మంది ఉన్నారు. వీరికి ఈ సంవత్సరం నుంచే బీమా వర్తించనుంది. రైతుబీమా పథకం ప్రారంభం నుంచి ఇప్పటివరకు మరణించిన 6,358 మంది రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందింది. రైతు మరణిస్తే అతడిపై ఆధారపడిన కుటుంబం అనాథ కాకూడదే ఉద్దేశంతోనే ప్రభుత్వం రైతులకు బీమా సౌకర్యం కల్పిస్తోంది. అప్పులు తీర్చుకోవడం, పిల్లలను చదివించుకోవడంతో పాటు వ్యవసాయాన్ని మరింతగా వృద్ధి చేసుకోవడానికి బీమా మొత్తాని వినియోగించుకోవచ్చు. నామినీ మరణిస్తే కొత్త నామినీని ఏర్పాటు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోంది. ఇందుకోసం మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. లబ్దిదారుల పాలసీ ప్రీమీయం డబ్బులు ప్రభుత్వమే జీవిత బీమా సంస్థకు చెల్లిస్తుంది.

-గోవింద్, మెదక్ జిల్లా వ్యవసాయాధికారి



పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌లో మెదక్ ఎస్పీ

విచారణలో జాప్యాన్ని ఉపేక్షించం

- మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

పాపన్నపేట, జూలై 26 : ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల విచారణలో జాప్యం జరిగితే సంబంధిత స్టేషన్ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని ఎస్పీ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. పాపన్నపేట మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది వివరాలు, విధుల కేటాయింపు గురించి స్టేషన్ హౌస్‌ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. నమోదైన కేసులు, దర్యాప్తులో పురోగతిపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాల నియంత్రణకు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఏడుపాయల వద్ద మంజీరా నదిలో ఈతకు వెళ్లి మృత్యువాత పడుతున్న ఘటనల నేపథ్యంలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీ కెమెరాల ఏర్పాటులో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలని సిబ్బందికి సూచించారు.

ఇక.. ఐటీఐలన్నీ ఏటీసీలు

- అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్పు
- జిల్లాలో మూడు ఐటీఐల ఉన్నతీకరణ
- 'టాటా' సంస్థల సహకారంతో పనులు



సంగారెడ్డి అర్బన్, జూలై 26 : యువతలో నైపుణ్యం పెంపొందించాలని ప్రభుత్వం సంకల్పించింది. వివిధ వృత్తులు, నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చే ఐటీఐల్లో మారుతున్న కాలానికి అనుగుణంగా శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ) ఏర్పాటు చేసేందుకు సర్కారు చర్యలు చేపట్టింది. ఈమేరకు ప్రభుత్వ ఐటీఐలన్నీ అప్‌గ్రేడ్ కానున్నాయి.

'టాటా' సంస్థ సహకారంతో..

సంగారెడ్డి జిల్లాలో మూడు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ) ఏర్పాటు కానున్నాయి. సంగారెడ్డి, రామచంద్రాపురం, హత్నూర ప్రభుత్వ ఐటీఐ(ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ)ల ప్రాంగణాల్లో ఏటీసీ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఒక్కో ఏటీసీని సుమారు రూ.4.50 కోట్లతో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే టాటా టెక్నాలజీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని, నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. ఆరు నెలల్లో పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చేలా కాంట్రాక్టర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. విద్యార్థులకు కొత్తగా ఆరు రకాల ట్రేడ్లలలో శిక్షణ ఇవ్వనున్నారు. కంప్యూటర్ న్యూమరికల్స్(సీఎన్‌సీ)మిషన్స్‌తో పాటు ఆధునిక యంత్ర పరికరాలను సమకూర్చనున్నారు. వివిధ ట్రేడ్లలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు టాటా టెక్నాలజీ సంస్థతో పాటు పారిశ్రామిక సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. జిల్లాలో మూడు ప్రభుత్వ, 15 ప్రైవేటు ఐటీఐ కళాశాలలున్నాయి. జిల్లాలో ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఏటీసీల ఏర్పాటుతో ప్రభుత్వ ఐటీఐలకు మహర్దశ పట్టనుంది.

ఏటీసీలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

టాటా సంస్థ సహకారంతో జిల్లాలో మూడు ఏటీసీలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. నైపుణ్యాభివృద్ధితో సత్వర ఉపాధి అవకాశాలు పొందవచ్చు. విద్యార్థులు ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-కె.రాజేశ్వర్‌రావు, ఐటీఐల జిల్లా కన్వీనర్

రేపు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

సంగారెడ్డి అర్బన్, జూలై 26 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28న ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జూబ్లీ క్లబ్ ప్రాంగణంలోని ఎంఎస్ అకాడమీలో జరగనున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 10 గంటలకు ఒరిజినల్ ఆధార్, బర్త్ సర్టిఫికెట్, బోనాఫైడ్, రెండు ఫొటోలతో హాజరుకావాలని తెలిపారు. క్రీడాకారులు 1.9.2008 నుంచి 31.08.2010 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మహేష్

నారాయణరావుపేట, జూలై 26 : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి తునికి మహేష్ డిమాండ్ చేశారు. నారాయణరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, ఎంపీవోలకు కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తునికి మహేష్ మాట్లాడుతూ మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీవో నంబర్ 51ని సవరించాలని, పాత పద్ధతిలోనే కేటగిరీలను కొనసాగించాలన్నారు. జీవో నంబర్ 60 ప్రకారం కేటగిరీల వారీగా విధులు నిర్వహిస్తున్న వారికి వేతనాలు సవరించి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న చలో హైదారాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు శ్రీకాంత్, నరేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్య పడొద్దు

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

తొగుట, జూలై 26 : కార్యకర్తలు అధైర్య పడొద్దని, బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని దుబ్బాక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వరదరాజుపల్లి, గోవర్ధనగిరి గ్రామాల్లో శుక్రవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గోవర్ధనగిరిలో ఇటీవల గుండెపోటుకు గురైన లింగంను, వరదరాజుపల్లిలో మృతిచెందిన కార్యకర్త తిరుపతిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వరదరాజుపల్లిలో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులైన రాజవ్వ, లాస్య, రవి కుటుంబాలకు చెక్కులను పంపిణీ చేశారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, స్వామి, చిలువేరి మల్లారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, భైరయ్య, వెంకట్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, స్వామిరెడ్డి, రాఘవులు తదితరులు ఉన్నారు.

ఎఫ్‌పీవో లావాదేవీల అవకతవకలపై విచారణ

చేర్యాల, జూలై 26 : చేర్యాల మండలం చిట్యాల గ్రామంలో రైతుల భాగస్వామ్యంతో నెలకొల్పిన ఎఫ్‌పీవో నిర్వాహకులు లావాదేవీలలో అవకతవకలకు పాల్పడ్డారన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం నాబార్డు అధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని చిట్యాల, ఆకునూరు, చుంచనకోట, వేచరేణి, కడవేరుగు గ్రామాలకు చెందిన సుమారు 380 మంది రైతులు మూడేళ్ల క్రితం వ్యక్తిగత సభ్యత్వం పొంది సంఘంగా ఏర్పడి ఫర్టిలైజర్ దుకాణాన్ని నెలకొల్పారు. వ్యాపారాభివృద్ధికి నాబార్డు ద్వారా రూ.6.20 లక్షలు నిధులు మంజూరు చేసినప్పటికీ కొన్నాళ్లుగా లావాదేవీలు జరపకపోగా, లెక్కలు చూపకుండానే నష్టాల్లో ఉందంటూ రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చని విషయమై సందేహాలు తలెత్తాయి. దీంతో ఇటీవల పలువురు నాబార్డు అధికారులకు ఫిర్యాదు చేయడంతో చిట్యాలకు చేరుకున్నారు. రైతువేదికలో రైతుల సమక్షంలో లావాదేవీలను పరిశీలించారు. నష్టం అంచనా వివరాలు తెలియాల్సి ఉంది.

'మహిళా శక్తి'ని సద్వినియోగం చేసుకోవాలి

● మెప్మా సిద్దిపేట జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ హనుమంత్‌రెడ్డి

గజ్వేల్, జూలై 26 : మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వ్యాపారపరంగా అభివృద్ధి చెందేందుకు మహిళలకు రుణాలు అందజేస్తామని మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ హనుమంత్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళిగుప్తా, కమిషనర్ నరసయ్యతో కలసి శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో మహిళా శక్తి అమలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి మెప్మా స్లామ్ సమైక్య ప్రతినిధులు, రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార పరంగా అభివృద్ధి చెందేందుకు బ్యాంకులు శ్రీనిధి నుంచి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారి సరిత, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

50 శాతం పీఆర్సీ ప్రకటించాలి

● పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ

చేర్యాల, జూలై 26: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలని పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఏ.శశిధర్‌శర్మ పేర్కొన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం యూనియన్ సభ్యత్వ నమోదు చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐదేళ్లకోసారి ప్రకటించే పీఆర్సీ ఉపాధ్యాయ, ఉద్యోగుల జీవన ప్రమాణాలతో ముడిపడి ఉన్నందున ప్రభుత్వం తాత్సారం వహించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండలాధ్యక్షుడు కేవీయస్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రావు, వరదరాజులు, లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

దళిత, గిరిజనుల సమగ్రాభివృద్ధిపై అసెంబ్లీలో చర్చించాలి

● ఎమ్మెల్సీ దేశపతిని కోరిన డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

గజ్వేల్, జూలై 26 : దళిత, గిరిజనుల సమగ్రాభివృద్ధిపై అసెంబ్లీలో చర్చించాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌ను డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ కోరారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం దేశపతిని కలిసిన శంకర్ ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధుల కేటాయింపుపై మాట్లాడారు. దళితుల, గిరుజనుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణలను అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని డిమాండ్ చేయాలని కోరారు.

విద్యాధరిలో శని త్రయోదశి మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

● ఆలయ వ్యవస్థాపకుడు చంద్రశేఖర శర్మ సిద్ధాంతి

వర్గల్, జూలై 26 : వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని శనైశ్చరాలయంలో ఆగస్టు 17, 31వ తేదీలలో నిర్వహించే శని త్రయోదశి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయ్యాలని వర్గల్ విద్యాధరి క్షేత్ర వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పేర్కొన్నారు. శుక్రవారం విద్యాధరి క్షేత్రంలో ఆలయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెలలో శనిత్రయోదశి వేడుకలతో పాటు సెప్టెంబర్ 7న వినాయక నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించాలని, అందుకు కావలసిన ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు ఇప్పటి నుంచే మొదలు పెట్టాలన్నారు. ఆలయ నిర్వహణ, క్షేత్రానికి వచ్చే భక్తులకు అమ్మవారి దర్శనం, భక్తుల భద్రత, వేద పాఠశాల నిర్వహణ, నిత్యాన్నదానంపై కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. క్షేత్రంలో ప్రతీ ఉత్సవానికి సహకరిస్తున్న దాత డాక్టర్ రాజేశ్వర్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుకు వాహనం ఢీకొని ఒకరి మృతి

చిన్నశంకరంపేట, జూలై 26 : చెట్టుకు వాహనం ఢీకొని ఒకరు మృతి చెంది సంఘటన చిన్నశంకరంపేట మండలం టీమాందాపూర్ గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుట్టి రవి(40) సొంత పనుల కోసం బైక్‌పై వెళ్తున్న సమయంలో గ్రామ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ప్రమాదవశాత్తూ బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొన్నది. ఈ ఘటనలో రవి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ నారాయణగౌడ్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రవికి భార్య సంధ్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రియుడు వివాహానికి నిరాకరించడని ఆత్మహత్యాయత్నం..

చికిత్స పొందుతూ యువతి మృతి

కొండపాక, జూలై 26 : ప్రేమించిన వ్యక్తితో వివాహానికి ఒప్పుకోకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడిన యువతి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన కొండపాక మండలంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి బందారం గ్రామానికి చెందిన తిప్ప స్వామి, బాలమణి కుమార్తె శివాని(20) సిద్దిపేటలో డిగ్రీ పూర్తి చేసి మూడు నెలలుగా ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నది. అయితే, ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో ఇదే మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమకు దారి తీసింది. ఇంట్లో పెళ్లి ప్రస్తావన వచ్చే సరికి తల్లిదండ్రులకు తన ప్రేమ గురించి చెప్పింది. ఈ విషయాన్ని యువకుడితో ప్రస్తావించి పెళ్లి చేసుకోవాలనగా అతడు నిరాకరించాడు. విషయం తెలిసి తల్లిదండ్రులు శివానిని మందలించటంతో కలత చెందింది. ఈనెల 10 తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన తల్లిదండ్రులు ఆమెను సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసి పోలీసులు శివాని వాంగ్మూలం సేకరించారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. పదిహేను రోజులుగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి శివాని మృతిచెందింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఫోరెన్సిక్ వైద్య పరీక్షల అనంతరం పోలీసుల సమక్షంలో పోస్టుమార్టం చేశారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం బందారం తరలించారు.

అమెరికాలో ఉన్న తమ్ముడిలా మాట్లాడి

రూ.70 వేల మోసం

పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ

జిన్నారం, జూలై 26 : అమెరికాలో ఉన్న తమ్ముడిలా కాల్‌లో మాట్లాడి ఓ మహిళ నుంచి రూ.70 వేలు దోచేశారు సైబర్ కేటుగాళ్లు. బొల్లారం సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక విఘ్నేశ్వర కాలనీలో నివాసం ఉండే పల్లగాని మధు భార్య తమ్ముడు అమెరికాలో ఉంటున్నాడు. ఈ నెల 25న మధు భార్యకు ఫోన్ వచ్చింది. ఆమె తమ్ముడిలా మాట్లాడిన గుర్తు తెలియని వ్యక్తి అర్జెంట్‌గా రూ.70 వేలు పంపమని అడిగాడు. వెంటనే ఆమె పంపించగా, మరో రూ.30 వేలు కావాలని మళ్లీ అడిగాడు. అనుమానం వచ్చిన బాధితురాలు అదే నంబర్‌కు ఫోన్ చేస్తే సమాధానం రాలేదు. దీంతో మోసపోయానని గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చిరుత దాడిలో గేదె మృతి

తొనిగండ్లలో ఘటన



చిరుత దాడిలో మృతిచెందిన గేదె

రామాయంపేట, జూలై 26 : ఆహారం కోసం పశువులపై చిరుత చేస్తున్న దాడులు రైతులను నిద్ర లేకుండా చేస్తున్నాయి. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు జంకుతున్నారు. తాజాగా శుక్రవారం తెల్లవారుజామున మండల పరిధి తొనిగండ్ల శివారు పటేల్ కుంట వద్ద చిరుత ఓ దున్నపోతును చంపేసింది. రైతు పోటీగారి రమేష్ ఎప్పటిలాగే తన పొలంలోని కొట్టంలో పశువులను కట్టేశాడు. తెల్లవారి వెళ్లేసరికి కొద్ది దూరాన దున్నపోతు చనిపోయి ఉంది. అక్కడ చిరుత ఆనవాళ్లు కనిపించాయని బాధిత రైతు తెలిపారు. ఈ మేరకు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. వారం క్రితమే ఝాన్సీ లింగాపూర్ శివారులోనూ ఓ గేదెను చిరుత చంపేసింది. ఇప్పటికే సుమారు పది పశువులు చిరుతకు ఆహారమయ్యాయి. గతంలో చిరుతను పట్టుకునేందుకు బోన్లు ఏర్పాటు చేసిన అటవీశాఖ ఇపుడు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇకనైనా అధికారులు చిరుతను పట్టుకునేందుకు చర్యలు చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఎస్ఈగా జగదీశ్వర్



బాధ్యతలు స్వీకరిస్తున్న జగదీశ్వర్

మెదక్ మున్సిపాలిటీ, జూలై 26 : పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఎస్ఈగా టి.జగదీశ్వర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి డీపీఆర్ఈఈగా పనిచేసిన ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన బి.శ్రీహరిగౌడ్ రంగారెడ్డి జిల్లా విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈగా బదిలీపై వెళ్లారు. బాధ్యతలు తీసుకున్న ఇన్‌చార్జి ఎస్ఈ జగదీశ్వర్ అధికారులతో సమీక్ష నిర్వహించి పెండింగ్ పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న మంబోజిపల్లి-ధామరంచ హైలెవల్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈ నర్సింలు, డీఈ పాండురంగారెడ్డి, పీఏ టు-ఎస్ఈ పవన్‌కుమార్‌రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించి రాష్ట్రం పేరు నిలబెట్టాలి

● **తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గణపతి**



ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు

సిద్దిపేట టౌన్, జూలై 26 : క్రీడల్లో రాణించి రాష్ట్రం పేరును నిలబెట్టాలని తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గణపతి ఫాల్గుణ క్రీడాకారులకు సూచించారు. ఆగస్టు 1 నుంచి కర్ణాటకలో జరిగే జూనియర్ జాతీయ బాలికల ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారుల ఎంపిక, శిక్షణ శిబిరం సిద్దిపేట పట్టణంలోని ఫుట్‌బాల్ స్టేడియంలో శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కార్యక్రమంలో గణపతి ఫాల్గుణ మాట్లాడుతూ గెలుపోటములు పక్కనబెట్టి ఆటను ఆస్వాదిస్తూ ఆడాలని సూచించారు. మనసును ఆటపై కేంద్రీకరిస్తే విజయం మీ సొంతం అవుతుందని, శిబిరంలో మీరు నేర్చుకున్న ఆటను అద్భుతంగా ప్రదర్శించేలా అందరూ ఉత్సాహంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని, బయట ఆహారానికి, నీటికి దూరంగా ఉండాలని సూచించారు. శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు సిద్దిపేట అసోసియేషన్ కార్యదర్శి, కోచ్ అక్బర్ నవాబ్, వినోద్, సభ్యులను అభినందించారు. సిద్దిపేట స్పోర్ట్స్ కన్వీనర్ పాలసాయిరాం మాట్లాడుతూ జాతీయస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనే తెలంగాణ జట్టును సిద్దిపేటలో ఎంపిక చేయడం గర్వంగా ఉందని, మాజీ మంత్రి హరీశ్‌రావు చొరవతోనే సిద్దిపేటలో స్పోర్ట్స్ హబ్ ఏర్పాటు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కృష్ణమూర్తి, సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గణేష్, సభ్యులు సాజిద్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్డుపై వెళ్లేదెలా?

నార్సింగి- శాలిపేట దారిలో నాట్లు వేసి నిరసన



బురదమయమైన నార్సింగి-శాలిపేట్ దారిలో నాట్లు వేస్తున్న గ్రామస్థులు



చేగుంట జూలై 26 : నార్సింగి మండలం కేంద్రం నుంచి శాలిపేట్‌కు వెళ్లే దారి బురదమయమై అడుగు తీసి అడుగు వేయరావడం లేదు. శుక్రవారం ఈ దారిలో వరి నాట్లు వేసి పరిసర ప్రాంతాల రైతులు నిరసన తెలిపారు. ఇటీవల ఈ రోడ్డు నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి దాదాపు రూ.18 లక్షలను మంజూరు చేయించి, పనులను ప్రారంభింపజేశారు. రోడ్డు విస్తరణ కోసం సహకరించాలని కోరగా, రైతులు ఒప్పుకున్నారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ మట్టిని పోసి చేతులెత్తేశారు. మొరం వేయడానికి ముందు ఈదారిలో కనీసం ద్విచక్ర వాహనంపైనైనా ప్రయాణం చేయడానికి వీలుగా ఉండేదని, ఇప్పుడు కాలి నడకన కూడా వెళ్లడం సాధ్యం కావడం లేదని రైతులు వాపోతున్నారు. పొలాలకు మందు బస్తాలు ఇతర సామగ్రి తీసుకెళ్లలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే చొరవ తీసుకుని వెంటనే రోడ్డు మరమ్మతు చేయాలని కోరారు.

బీబీపేట ప్యాక్స్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం

● **సమావేశానికి హాజరు కానీ ఇరు వర్గాల డైరెక్టర్లు**

కల్హేర్, జూలై 26 : మండల పరిధిలోని బీబీపేట ప్యాక్స్ చైర్మన్ మహారెడ్డి నరేందర్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. ఈనెల 5న ఏడుగురు డైరెక్టర్లు సంగారెడ్డిలోని జిల్లా సహకార శాఖ అధికారికి అవిశ్వాస నోటీసు ఇవ్వగా, శుక్రవారం బీబీపేట ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా సహకార అధికారి టి.ప్రసాద్ రిజిస్ట్రార్లు సిద్దారెడ్డి, చిన్నారావు హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం ప్రారంభం కాగా సమావేశానికి ఒక్కరూ హాజరుకాలేదు. నిబంధనల ప్రకారం అర గంట సమయం వరకు అధికారులు వేచి చూశారు. అయినా, ఇరు వర్గాలకు చెందిన ఒక్క డైరెక్టర్ సమావేశానికి రాలేదు. దీంతో చైర్మన్ నరేందర్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు డీసీవో ప్రసాద్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నరేందర్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు, మరో ఇద్దరు బీఆర్ఎస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టగా ఇందులో నుంచి ఇద్దరు చైర్మన్ నరేందర్‌రెడ్డి నిర్వహించిన క్యాంపులో చేరిపోయారు. దీంతో అవిశ్వాసానికి అవసరమైన బలం లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు ప్రత్యేక సమావేశానికి హాజరు కాలేదు. క్యాంపు పేరిట విహారయాత్రలో ఉన్న చైర్మన్ వర్గానికి చెందిన డైరెక్టర్లు కూడా సమావేశానికి హాజరు రాలేదు. ఈ సందర్భంగా చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీబీపేట ప్యాక్స్ సీఈవోపై ఫిర్యాదు చేద్దామని నమ్మించి, అవిశ్వాసంపై సమాచారం ఇవ్వకుండానే వారితో సంతకాలు తీసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి డైరెక్టర్ల బలం లేకుండానే తనపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చారని విమర్శించారు. ఆత్మ కమిటి



కల్హేర్ మండలంలోని బీబీపేట ప్యాక్స్ కార్యాలయంలో అధికారులు

మాజీ చైర్మన్ గుండు నరేందర్, ప్యాక్స్ వైస్ చైర్మన్ క్రిష్ణమూర్తి, డైరెక్టర్ బండారి సాయిలు స్పందిస్తూ తమకు డైరెక్టర్ల బలం ఉందని, చైర్మన్ నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ డైరెక్టర్లను కొనుగోలు చేసి క్యాంపునకు తరలించారని ఆరోపించారు. అయినా, బీబీపేట ప్యాక్స్‌లో జరిగిన అవినీతిని వెలికితీస్తామని అన్నారు. అవిశ్వాసం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కల్హేర్ ఎస్ఐ వెంకటేశం ఆధ్వర్యంలో బందోబస్తును చేపట్టారు.

టేక్మాల్ సొసైటీలో విరమించుకున్న డైరెక్టర్లు

టేక్మాల్, జూలై 26 : టేక్మాల్ సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానాన్ని విరమించుకున్నారని మెదక్ జిల్లా డీసీవో కరుణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన టేక్మాల్ సహకార సంఘం కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గురువారం అవిశ్వాస సమావేశాన్ని అనివార్య కారణాలతో శుక్రవారం నాటికి వాయిదా వేశామని తెలిపారు. అయితే, శుక్రవారం సమావేశాన్ని నిర్వహించడానికి ముందే ఎనిమిది మంది డైరెక్టర్లు అవిశ్వాసాన్ని వెనక్కి తీసుకున్నారని తెలిపారు. ఓ డైరెక్టర్‌ను అనారోగ్యంతో హైదరాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నామని, అందుకే విరమించుకుంటున్నట్లు విరమణపత్రం అందజేశారని వివరించారు.



టేక్మాల్ సొసైటీ కార్యాలయంలో మాట్లాడుతున్న మెదక్ డీసీవో కరుణ

దీంతో, ఈ అవిశ్వాసం నెగ్గినట్టు కాదు వీగినట్టు కాదు అని ఆమె పేర్కొన్నారు. గత చైర్మన్ కుచన్‌పల్లి యశ్వంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకయ్య తమ పదవుల్లో కొనసాగుతారని ఆమె ప్రకటించారు. ఆమె వెంట సీఈవో వేణుగోపాల్, అధికారులు ఉన్నారు.

దశాబ్దాల నిరీక్షణకు తెరపడేదెన్నడో?

● **కొలిక్కిరాని జహీరాబాద్ ఐడీఎస్ఎంటీ ప్లాట్ల సమస్య**



ఐడీఎస్ఎంటీ ప్లాట్ల కోసం కేటాయించిన స్థలం



జహీరాబాద్, జూలై 26 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జహీరాబాద్ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ సమీపంలో 1982లో ఏర్పాటు చేసిన ఐడీఎస్ఎంటీ (ఇంటిగ్రెటెడ్ డెవలప్‌మెంట్ స్మాల్ అండ్ మీడియం టౌన్‌షిప్) కాలనీలో ప్లాట్ల కేటాయింపు సమస్య దశాబ్దాల కాలంగా కొలిక్కి రావడం లేదు. ఇదిగో చేస్తాం.. అదిగో అవుతుందంటూ అధికారులు, నాయకులు హామీలు ఇస్తున్నారే తప్ప సమస్యను పరిష్కరించడం లేదు. ఐడీఎస్ఎంటీ అంటేనే అమ్మో అదో వివాదాస్పద సమస్య అనే స్థాయికి తీసుకొచ్చారు. సజావుగా కొనసాగుతున్న ప్రభుత్వ కార్యక్రమాల్లో కొందరు అనవసరంగా తలదూర్చుతూ చివరకు వాటిని అర్ధాంతరంగా ఆపే వరకు ఊరుకోరని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అర్హులు సైతం అనర్హులుగా మారుతున్న పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

101 ఎకరాల్లో 1,294 ప్లాట్లు

1982లో అప్పటి ప్రభుత్వం పట్టణంలోని హౌజింగ్ బోర్డుకు ఆనుకుని ఉన్న 156, 157, 158, 160, 161 సర్వే నంబర్లలోని 101 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ భూమిలో ఐడీఎస్ఎంటీ కింద 1,294 ప్లాట్లను చేశారు. అందులో 1,115 ప్లాట్లను అప్పట్లో రిజిస్ట్రేషన్‌లు చేసేందుకు సిద్ధం చేశారు. 1987 నుంచి పంపిణీ ప్రక్రియ ప్రారంభించి 2009 వరకు ఏటా కొన్ని చొప్పున నామినల్ ఫీజుతో మున్సిపాలిటీలో రిజిస్ట్రేషన్లు చేశారు. అయితే, రిజిస్ట్రేషన్లలో అనేక గోల్‌మాల్‌లు జరిగాయి. ఈ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కొందరు 2009లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నిబంధనలకు విరుద్ధంగా కేటాయించిన వాటిని రద్దుచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని 2013లో న్యాయస్థానం అధికారులను ఆదేశించింది. 2009 నుంచి 2013 వరకు ప్లాట్ల సమస్య న్యాయస్థానం పరిధిలో ఉండడంతో ఐడీఎస్ఎంటీ కాలనీ విషయంలో అధికారులు, నాయకులు పట్టించుకోలేదు. 2013లో న్యాయస్థానం ఆదేశాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో ప్రత్యేక సర్వేలు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. అంతే ఇక దీనిని పట్టించుకోలేదు. ఈ వ్యవహారాన్ని ఎటుతేల్చకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఆదాయ వర్గాల వారీగా కాలనీలు

అప్పట్లో ఇక్కడ ఆదాయ వర్గాల వారీగా ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ, ఈడబ్ల్యూఎస్ కాలనీలను ఏర్పాటు చేయాలని నిబంధనలను తీసుకువచ్చి అర్హులను గుర్తించి ప్లాట్ల కేటాయింపులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఈడబ్ల్యూఎస్ కింద 110 గజాలకు రూ.5 వేలు, ఎల్ఐజీలో 260 గజాలకు రూ.15వేలు, ఎంఐజీలో 300 గజాలకు రూ.16,500, హెచ్ఐజీలో 360 గజాలకు రూ.21,000 చొప్పున ఫీజులను నిర్ధారించి అప్పట్లో రిజిస్ట్రేషన్‌లను చేశారు. ఇందులో ఉన్నతాదాయ వర్గాలకు హెచ్ఐజీలో 76 ప్లాట్లు, మధ్యతరహా వారికి ఎంఐజీలో 264 ప్లాట్లు, పేదలకు ఎల్ఐజీలో 305, వెనుకబడిన వర్గాలకు ఈడబ్ల్యూఎస్ కాలనీలో మరికొన్ని ప్లాట్లను అప్పట్లో లబ్ధిదారులకు కేటాయించారు. ప్రస్తుతం అందులో సుమారు 300 మంది లబ్ధిదారులు ఇళ్లను సైతం నిర్మించుకున్నారు. ఇళ్లను నిర్మించుకున్న కొందరు తమ కాలనీలో వసతులు కల్పించాలని అధికారులకు, పాలకులకు వేడుకున్న ప్రయోజనం లేకుండా పోయింది.

ఎన్నికలతో సమస్యకు బ్రేక్

ఏళ్ల తరబడి నానుతూ వస్తున్న ఐడీఎస్ఎంటీ ప్లాట్ల సమస్యను గతంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు, ప్రజలు మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్‌కు విన్నవించారు. వారు స్పందించి వివాదస్పదంగా లేని వాటిని మ్యుటేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో లబ్ధిదారుల్లో కొంత మేరకు ఆశలు చిగురించాయి. వారి ఆదేశాలతో అడుగుపడుతున్న క్రమంలోనే రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ రావడంతో పంపిణీ ప్రక్రియకు బ్రేక్ పడింది. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సమస్యకు తీరుతుందని ఆశించిన లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యను పరిగణలోకి తీసుకుని పరిష్కరిస్తుందేమోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. లబ్ధిదారుల వద్ద సర్టిఫికెట్లు ఉన్నాయి కానీ ప్లాట్ ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి ఏర్పడింది.

ఉన్నతాధికారులకు నివేదించాం



ఐడీఎస్ఎంటీకి సంబంధించిన వివరాలన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. వారి సూచనల మేరకు అక్కడి నుంచి అనుమతులు వస్తే మ్యుటేషన్ ప్రారంభిస్తాం. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా తదుపరి కార్యాచరణ చేపడుతాం.

- శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

నిరుపేద విద్యార్థికి కలెక్టర్ చేయూత

● **ఐఐటీ సాధించిన ఆర్యన్ రోషన్‌కు**

ల్యాప్‌టాప్‌తో పాటు నగదు అందజేత

కోహెడ, జూలై 26 : మండలంలోని నకిరెకొమ్ముల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి బి.ఆర్యన్ రోషన్‌కు కలెక్టర్ ఎం.మను చౌదరి చేయూత అందించారు. కష్టపడి చదివి తిరుపతి ఐఐటీలో సీటు సాధించిన ఆర్యన్‌రోషన్‌కు శుక్రవారం సిద్దిపేట కలెక్టర్ తన చాంబర్‌లో రూ.40,500 విలువ చేసే హెచ్‌పీ ల్యాప్‌టాప్‌తో పాటు ఐఐటీ మొదటి సెమిస్టర్ ఫీజు రూ.36,750 చెక్‌ను అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆర్యన్ రోషన్ కోహెడ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివి 10 జీపీఏ సాధించాడు. అదే విద్యాలయంలో ఇంటర్మీడియట్ చదివి ప్రతిష్టాత్మకమైన తిరుపతి ఐఐటీలో కెమికల్ ఇంజనీరింగ్‌లో సీటు సాధించాడు. అతనికి ఐఐటీలో చేరేందుకు పేదరికం అడ్డురావడంతో స్పందించిన కలెక్టర్ చదువుకునేందుకు తోడ్పాటు నందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్యన్ రోషన్ తండ్రి చిన్నతనంలోనే మరణించినా తల్లి రాజమణి రోజు కూలి చేసి తనను చదివించగా పట్టుదలతో చదివి ఐఐటీ సీటు సాధించడం అభినందనీయమన్నారు. ఇలాగే ఐఐటీ పూర్తి చేసుకుని అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని, నిరుపేద విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.



ఆర్యన్ రోషన్‌కు ల్యాప్‌టాప్‌తో పాటు చెక్‌ను అందజేస్తున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

నాటిన మొక్కలను సంరక్షించాలి

● **సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి**

సిద్దిపేట టౌన్, జూలై 26 : మొక్కలను నాటడం కాదని, అవి పెరిగి ఫలాలు అందించే వరకు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో దేశ వ్యాప్తంగా మొక్కలు నాటాలన్న యూనియన్ బ్యాంక్ పిలుపు మేరకు.. సిద్దిపేట రీజనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణితో కలిసి ఆయన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో ప్రతీఒక్కరు భాగస్వాములవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఈద వికాస్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ రాఘవ, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

కొండపాక ఫిషరీస్‌కు రూ.10 లక్షల గ్రాంటు

కొండపాక, జూలై 26 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిర్వహిస్తున్న కొండపాక ఫిషరీస్ ప్రొడ్యూసింగ్ కంపెనీకి రూ.10 లక్షల ఈక్విటి గ్రాంటు మంజూరైనట్టు సంస్థ సీఈవో నారదాసు ఈశ్వర్ తెలిపారు. ప్రకృతి పర్యావరణ సంస్థ నిర్వహణలో ఏర్పాటైన కొండపాక ఫిషరీస్ ప్రొడ్యూసింగ్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో 500 మంది ముదిరాజ్ మత్స్యకారులతో రూ.10 లక్షల సభ్యత్వ వాటా ధనం సేకరించినట్టు పేర్కొన్నాడు. దీనికి అదనంగా మరో రూ.10 లక్షల ఈక్విటీ గ్రాంట్ నిధులు మంజూరైనట్లు ఆయన వివరించాడు. కేంద్ర మంత్రిత్వ శాఖ స్మాల్ ఫార్మర్స్ అగ్రి బిజినెస్ కన్సార్షియం నేతృత్వంలో ఈ రూ.10 లక్షల నిధిని కేటాయిస్తూ ఆర్డర్ కాపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టు ఆయన తెలిపాడు. ఈ సందర్భంగా కొండపాక ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ పాలకవర్గ ప్రతినిధులకు, రాష్ట్ర మత్స్యశాఖ సంచాలకులు ప్రియాంక, అదనపు సంచాలకులు శంకర్ రాథోడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలోని పీఏసీఎస్‌లలో రూ.212 కోట్ల రుణమాఫీ

సంగారెడ్డి జిల్లా సహకార అధికారి టి.ప్రసాద్



మాట్లాడుతున్న డీసీవో ప్రసాద్

కల్హేర్, జూలై 26 : ఉమ్మడి మెదక్ జిల్లాలోని 53 ప్రాథమిక సహకార సంఘాల పరిధిలోని 22,086 మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ పథకంలో ప్రయోజనం కలుగనుందని సంగారెడ్డి జిల్లా సహకార శాఖ అధికారి టి. ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన బీబీపేటలో స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఉన్న 53 పీఏసీఎస్‌లలో మూడు పీఏసీఎస్‌లు పనిచేయడం లేదని, మిగతా 49లో 22,086 మంది రైతులకు రూ.212.46 కోట్లు రుణమాఫీ జరుగనున్నట్లు ఆయన తెలిపారు. రూ.లక్ష లోపు రుణమాఫీలో భాగంగా మొదటి విడతగా 6,090 మంది రైతులకు రుణమాఫీ జరిగినట్లు ఆయన తెలిపారు. 16 పీఏసీఎస్‌లు ఎస్‌బీఐ పరిధిలో ఉండగా ఆ సొసైటీల్లో రుణమాఫీ జరగలేదని, దీనిపై ప్రభుత్వ ఆదేశాల అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతీ పీఏసీఎస్‌లలో ఎరువుల విక్రయం, నగదు లావాదేవీలు నిరంతరం జరపాలని, దీని ద్వారా రైతులు సభ్యులుగా ఉన్న పీఏసీఎస్‌లకు ఎంతో లాభాలు వస్తాయని ప్రసాద్ తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని ఝరాసంగం, నిజాంపేట మండలంలోని బాచేపల్లి, కొండాపూర్ మండలంలోని మల్కాపూర్, సిర్గాపూర్ మండలంలోని బొక్కస్‌గామ్‌లలో పెట్రోల్ పంప్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు డీసీవో ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో సహకార శాఖ రిజిస్ట్రార్లు సిద్దారెడ్డి, చిన్నారావ్, సీఈవో రాంచందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలకు తాళం

● **వైద్యురాలు, ఫార్మాసిస్టు బదిలీ**

● **మరెవరిని కేటాయించని అధికారులు**



తాళం వేసి ఉన్న ఆయుర్వేద వైద్యశాల గది

అక్కన్నపేట, జూలై 26 : అక్కన్నపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓ గదిలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో వైద్యం అందని ద్రాక్షలా మారింది. ఈ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యురాలు, ఫార్మాసిస్టు బదిలీఅయ్యారు. దీంతో శుక్రవారం ఆయుర్వేద వైద్యశాలకు తాళం పడింది. ఈ విషయం తెలియక వర్షంలో హాస్పిటల్‌కు వచ్చిన రోగులు ఇబ్బందులు పడ్డారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యురాలు డాక్టర్ సరోజ కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని బోర్నపల్లి ఆయుర్వేద వైద్యశాలకు, ఫార్మాసిస్టు రాజమణి కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రంలోని ఆయుర్వేద వైద్యశాలకు బదిలీపై వెళ్లగా వైద్యాధికారితోపాటు ఫార్మాసిస్టును ఇంకా భర్తీ చేయలేదు. ఆయుర్వేద భవనం శిథిలావస్థకు చేరడంతో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓ గదిలో ఆయుష్ సేవలను అందిస్తున్నారు. మండల పరిధిలోని పలు గిరిజన తండాలు, గ్రామాల నుంచి ప్రజలు ఆయుర్వేద చికిత్స కోసం ఈ వైద్యశాలకు వస్తారు. ప్రస్తుతం వారు బదిలీపై వెళ్లడంతో తాళాలు తీసే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్కన్నపేట ఆయుర్వేద వైద్యశాలలో వైద్యాధికారి, ఫార్మాసిస్టు పోస్టులను సత్వరమే భర్తీ చేసి సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యులను నియమించాలి



వైద్యులు, సిబ్బంది లేక ఆయుర్వేద వైద్యశాలకు తాళం పడింది. దీంతో మండల ప్రజలకు ఆయుర్వేద వైద్యం అందడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్యులను నియమించి ప్రజలకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి.

- పెసరు సాంబరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, అక్కన్నపేట

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● మెదక్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరాం



నర్సాపూర్: ఆద్మాపూర్‌లోని క్యాంపును సందర్శించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరాం

నర్సాపూర్/కొల్చారం, జూలై 26: వర్షాకాలంలో వచ్చే జ్వరాలు ఇతర వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి సేవలందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరాం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఆద్మాపూర్‌లో వర్షాకాలం సందర్భంగా ఏర్పాటు చేసిన క్యాంపును జిల్లా వైద్యాధికారితో పాటు డివిజన్ డాక్టర్ సృజన, పీవో డాక్టర్ నవీన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ అందుతున్న వైద్య సేవలను, రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో పని చేసే వైద్య సిబ్బందితగిన మందులు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు ప్రజలను కూడా అప్రమత్తం చేయాలన్నారు. అదేవిధంగా కొల్చారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి శ్రీరాం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మందుల స్టోర్ రూం పరిశీలించి ఏయే మందులు ఉన్నాయో తెలుసుకున్నారు. కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ నవీన్‌కుమార్, కొల్చారం పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్, ఫార్మాసిస్టు సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

● చిన్నశంకరంపేట: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు ముందస్తు అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి డాక్టర్ సాయిసింధు ఏఎన్ఎంలకు సూచించారు. శుక్రవారం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమీక్షలో మాట్లాడారు. ప్రతీ ఇంటికి వెళ్లి పరిశుభ్రతపై ప్రజలకు వివరించాలన్నారు. జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు వహించేందుకు పలు సూచనలు కల్పించాలని ఆదేశించారు.

ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల నిరసన

మునిపల్లి, జూలై 26: బదిలీలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రమైన మునిపల్లి ఆదర్శ పాఠశాల ఎదుట మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాల ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి, పీజీటీ, టీజీటీ ఉపాధ్యాయులు ఉన్నారు.

పరిసరాల శుభ్రతపై స్పెషల్ డ్రైవ్

ఫ్రైడే- డ్రైడే కార్యక్రమాన్ని పురస్కరించుకొని శుక్రవారం మెదక్, సంగారెడ్డి జిల్లాలోని ఆయా గ్రామాల్లో అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ పాత నీటి తొట్టెలు, టైర్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు.



నర్సాపూర్ 7వ వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్, సిబ్బంది తదితరులు



నారాయణఖేడ్‌లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నమున్సిపల్ చైర్మన్, కమిషనర్

చేగుంట జూలై 26 : మండలంలో ఫ్రైడే డ్రైడే సందర్భంగా అధికారులు శుక్రవారం పలు గ్రామాల్లో ప్రజలకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. వడియారం గ్రామంలో మండల ప్రత్యేక అధికారి బ్రహ్మాజీ పాటు ఎంపీడీవో చిన్నారెడ్డి, వైద్యాధికారి అనిల్‌కుమార్, సీహెచ్‌వో సంపతి, పంచాయతీ కార్యదర్శి జైపాల్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

● చిన్నశంకరంపేట: ప్రతీ శుక్రవారం అందరూ తప్పనిసరిగా డ్రై డే పాటించాలని ఎంపీడీవో దామోదర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు ఎస్ కొండాపూర్, జంగరాయి, సూరారం, తదితర గ్రామాల్లోని అధికారులు వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను కాపాడటంతో ప్రజలు సిబ్బందికి సహకరించాలని సూచించారు. అనంతరం ప్రజలతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ సాయిసింధు, డిప్యూటీ తహసీల్దార్ మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● నిజాంపేట: మండల కేంద్రంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి గోవింద్ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలం దృష్ట్యా కాచి వడపోసిన నీటినే తాగాలని తెలిపారు. ముందుగా మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో పంచాయతీ పాలకవర్గ ఆధ్వర్యంలో ఇళ్ల వద్ద ఉన్న నీటి నిల్వలను తొలగింపజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి, ఎంపీవో ప్రవీణ్ కుమార్, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఆశా వర్కర్లు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● నర్సాపూర్: పట్టణంలోని 7,8 వార్డుల్లో శుక్రవారం ఫ్రైడే డ్రై డే నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన, కమిషనర్ జైతురాంనాయక్‌తో పాటు పలువురు రెండు వార్డుల్లో పర్యటించి ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వారి వెంట కౌన్సిలర్లు రుక్మమ్మ, రామచందర్, హెల్త్ ఆఫీసర్ మల్లిఖార్జున్, హెచ్ఈలు మంగమ్మ, అనిత, ఏఎన్ఎం రోజారాణి, స్వప్నప్రియ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

● కొల్చారం: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం అవుతాయని కొల్చారం మెడికల్ ఆఫీసర్ రమేష్, పంచాయతీ కార్యదర్శి అంజయ్య అన్నారు. కొల్చారంలో శుక్రవారం టీంల వారీగా పలు వీధుల్లో తిరుగుతూ నీటి తొట్లను, పాత టైర్లను తొలగింపజేశారు. ట్యాంకులను నిత్యం శుభ్రం చేసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఏకేపీవీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

● మనోహరాబాద్: వర్షాకాలం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్ఞానేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్, రంగాయపల్లి గ్రామాల్లో ఆయన మండల వైద్యాధికారి వికాస్ ఆధ్వర్యంలో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు జాగ్రత్తలను సూచించారు. ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● వెల్దుర్తి: నివాస గృహాలతో పాటు దుకాణ పరిసరాలు, రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని తహసీల్దార్ తులసీరామ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శిరీష, పంచాయతీ ఈవో బలరాంరెడ్డి సూచించారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా వెల్దుర్తిలోని పలు ఇళ్లతో పాటు స్వీట్ హౌస్, కిరాణా దుకాణాలను తనిఖీ చేశారు. పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న దుకాణదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

● నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపల్‌పరిధిలో శుక్రవారం ఫ్రైడే...డ్రైడే కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. మున్సిపల్‌చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆయా వార్డుల్లోని గృహాల్లో ఉన్న పూలకుండీల్లో పాతటైర్లలో నిల్వ నీటిని తొలగింపజేశారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. ఆయా వార్డుల్లోని మురుగు కాల్వలు, ఖాళీ స్థలాల్లో నిలిచిన నీటిలో దోమల నివారణకు రసాయన ద్రావణాన్ని పిచికారి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వివేకానంద్, శానిటేషన్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేటలో ఇద్దరు యువకులపై దుండగుల దాడి

●బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు

సదాశివపేట, జూలై 26: పట్టణంలో 65వ జాతీయ రహదారి పక్కన గల ఎస్ఎన్ ఫుడ్‌కోర్టు వద్ద ఇద్దరు యువకులను గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించి, దాడి చేసిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. సీఐ మహేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు సంపత్, సుమన్ కారులో జహీరాబాద్‌కు వచ్చి బంధువుల ఇంట్లో విందుకు హాజరై హైదరాబాద్‌కు గురువారం రాత్రి తిరుగుప్రయాణమయ్యారు. ఈ క్రమంలో అర్ధరాత్రి 2గంటల సమయంలో సదాశివపేటలోని ఎస్.ఎన్ ఫుడ్‌కోర్టు వద్ద కారు నిలిపారు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై అక్కడికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు కొందరు సంపత్, సుమన్‌ల వద్ద నుంచి సిగరేట్ అడిగి మేం ఇక్కడ లోకల్.. మేం అడిగితే వివరాలు చెప్పాలంటూ వారిని బెదిరించి, దాడికి పాల్పడ్డారు. దాడిలో సంపత్, సుమన్‌ల వద్ద ఉన్న రూ.1.50లక్షల విలువైన ఓ సెల్‌ఫోన్, 3 తులాల బంగారు గొలుసు, కారు తాళం చెవి కనిపించకుండా పోయాయి. అదే సమయంలో రహదారిపై పెట్రోలింగ్ వాహనం రావడాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ మహేష్ గౌడ్ పేర్కొన్నారు.

సీఈఐఆర్ పోర్టల్‌ను వినియోగించుకోండి: సంగారెడ్డి ఎస్పీ

సంగారెడ్డి క్రైం, జూలై 26: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు సీఈఐఆర్ పోర్టల్‌ను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఒక ప్రకటనలో కోరారు. విలువైన మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న ప్రజలకు తిరిగి ఇప్పించడానికి పోలీసు శాఖ సీఈఐఆర్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న మొబైల్ ఫోన్ల రికవరీ కోసం జిల్లాలో ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గత ఏడాది పోర్టల్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 1,108ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఫోన్లు పోగొట్టుకున్నవారు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రతీ ఫిర్యాదుపైనా స్పందించాలి: మెదక్ ఎస్పీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

టేక్మాల్, జూలై 26: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం టేక్మాల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుపై వెంటనే బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. సమస్యలు సృష్టించే వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై అందరికీ అవగాహన కల్పించారు. స్టేషన్ పరంగా పోలీస్ సిబ్బందికి పలు సూచనలు , సలహాలు అందించారు. అనంతరం స్టేషన్‌లో మొక్కలు నాటారు. ఎస్పీ వెంట అల్లాదుర్గం సీఐ రేణుక, ఎస్ఐ మురళి, సిబ్బంది ఉన్నారు.

యువతి అదృశ్యం



మనోహరాబాద్, జూలై 26: మండలంలోని రామాయపల్లికి చెందిన యువతి అదృశ్యమైంది. మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామాయపల్లి గ్రామానికి చెందిన తౌటిస్వామి కూతురు సౌజన్య(19) గురువారం రాత్రి ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు గాలించినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్‌గౌడ్ వివరించారు.

బొల్లారంలో వ్యక్తి..

జిన్నారం, జూలై 26: బొల్లారంలో నివాసముండే వ్యక్తి అదృశ్యమైనట్టు సీఐ గంగాధర్ తెలిపారు. స్థానిక లక్ష్మీనగర్‌లో నివాసం ఉండే మూస్కు బాబురావు (46) ఈ నెల 21న కూలీ పని కోసం ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదని అతడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సంగారెడ్డి రూరల్, జులై 26 : సంగారెడ్డి నియజకవర్గంలోని లబ్దిదారులకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. సదాశివపేట పట్టణానికి చెందిన 13 మందికి గాను రూ. 4,47,500 విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి,బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

భగీరథ డిప్యూటీ ఈఈగా సంపత్‌కుమార్

తూప్రాన్, జూలై 26: తూప్రాన్ మిషన్ భగీరథ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా ఎం. సంపత్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తూప్రాన్ మిషన్ భగీరథ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను నర్సాపూర్ సబ్ డివిజన్‌కు బదిలీ అయ్యారు.

జహీరాబాద్ ఆర్టీఏగా వెంకటయ్య

జహీరాబాద్, జూలై 26: జహీరాబాద్ ప్రాంతీయ రవాణా అధికారిగా వెంకటయ్య శుక్రవారం పదవీబాధ్యతలను చేపట్టారు.నల్గొండ జిల్లా సూర్యాపేట నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు.

అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు



సదాశివపేట 6వ వార్డులో గొల్లకురుమ సంఘం బోనాల పండుగలో దుర్గమ్మకు బోనం తీసుకెళ్తున్న నిర్మలాజగ్గారెడ్డి



సంగారెడ్డిలో బోనాల ఊరేగింపులో స్ఫూర్తి, అంబేడ్కర్ కళాశాలల యాజమాన్యం, విద్యార్థులు

సదాశివపేట, జూలై 26: సదాశివపేట పట్టణంలో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దుర్గాభవాని జాతర ఉత్సవాల్లో భాగంగా వాడవాడల నుంచి కులసంఘాల వారీగా బోనాలు ఊరేగిస్తున్నారు. శుక్రవారం 6వ వార్డు కృష్ణానగర్ కాలనీలో గొల్లకురుమ సంఘం బోనాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో టీజీఐఐసీ చైర్మన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి పాల్గొని దుర్గమ్మకు బోనమెత్తి భక్తులను ఉత్సాహపరిచారు. ఉత్సవాల్లో 6వ వార్డు కౌన్సిలర్ గుండు రవి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పట్నం సుభాష్, ఏఎంసీ వైస్ చైర్మన్ కంది కృష్ణ గుప్తా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని రావూస్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఆషాఢబోనాలు అందరినీ అలరించాయి. విద్యార్థినులు బోనాల సంస్కృతి, సంప్రదాయ వస్త్రధారణతో బోనాలు ఊరేగించి దుర్గమ్మకు సమర్పించారు. దుర్గామాత, దేవతల వేషధారణతో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

● సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డిలోని స్ఫూర్తి డిగ్రీ కళాశాల, డా.బీఆర్ అంబేడ్కర్ పారామెడికల్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బోనాల పండుగ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థినులు స్వయంగా బోనమెత్తి పోతురాజుల విన్యాసాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్ఫూర్తి కళాశాలలో నిర్వహించిన బోనాల కార్యక్రమంలో విద్యార్థులు డ్యాన్సులు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్, కరస్పాండెంట్ భార్గవి ధారాసింగ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

● నారాయణఖేడ్: ఖేడ్‌పట్టణంలోని సాయినగర్ కాలనీలో శుక్రవారం ముత్యాల పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కాలనీకి చెందిన మహిళలు భారి సంఖ్యలో తలపై బోనమెత్తుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

● ఝరాసంగం: మండల పరిధిలోని కొల్లూర్ గ్రామంలో శుక్రవారం ఆషాఢ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామదేవతలకు ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని పురవీధులగుండా వెళ్లి అమ్మవార్లకు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తులపూనకాల మధ్య బోనాల ఉత్సవాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కార్గిల్ వీరులను మరవొద్దు

● కార్గిల్ వీరులకు ఘన నివాళి



సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి రూరల్, జూలై 26: కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన జవానులను మనం ఎన్నడూ మరవొద్దని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దేశానికి రక్షణగా నిలుస్తున్న జవానుల సేవలను ఎల్లప్పుడు మననం చేసుకుంటూ, కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందినవారి కుటుంబ సభ్యులకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి వటపత్ర సాయి, జిల్లా సైనిక్ వెల్ఫేర్ బోర్డు సభ్యుడు తోపాజి అనంతకిషన్, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాలకృష్ణ, పూసల లింగాగౌడ్, అంజయ్య, కృపానిధి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్‌రాజ్ పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల హామీలు అమలు చేయాలి

● బీజేపీ కిసాన్ మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

సంగారెడ్డి అర్బన్, జూలై 26: కాంగ్రెస్ ఎన్నికల హామీలు అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంగారెడ్డి చౌరస్తాలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 29,30 వ తేదీల్లో మండల కార్యవర్గ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరజవానుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను పరిశీలించిన అధికారులు

జహీరాబాద్, జూలై 26: మండలంలోని కొత్తూర్(బి) గ్రామ శివారులో గల నారింజప్రాజెక్టు, ఝరాసంగం మండలంలోని ఏడాకులపల్లి గ్రామంలో గల కొత్తూరువాగు ప్రాజెక్టు, రాయికోడ్ మండలంలోని ఇందూర్‌లోగల బొగ్గులంపల్లి ప్రాజెక్టు, కోహీర్ మండలంలోని గోటిగార్‌పల్లి గ్రామ శివారులో గల పెద్దవాగుప్రాజెక్టులను నీటిపారుదల శాఖలకు చెందిన సంగారెడ్డి చీఫ్ ఇంజనీర్‌శ్రీధర్మ, సూపరింటెండెంట్ ఇంజనీర్ యేసయ్య శుక్రవారం సిబ్బందిలో కలిసి పరిశీలించారు. ముందుగా వారు పట్టణంలోని ఇరిగేషన్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా జహీరాబాద్‌కు బదిలీపై వచ్చి వారు బాధ్యతలను చేపట్టారు.

వచ్చే నెల 8 నుంచి ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్

సంగారెడ్డి అర్బన్, జూలై 26 : ఓపెన్ స్కూల్ విధానంలో పదోతరగతి, ఇంటర్‌లో అడ్మిషన్ పొందాలనుకునేవారు వచ్చే నెల 8వ తేదీ నుంచి సెప్టెంబరు 10వ తేదీ వరకు అడ్మిషన్ పొందాలని డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లు విస్తృతంగా ప్రచారం నిర్వహించి అభ్యాసకులు ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివరాలకు ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి 8008403635 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

గురుకులంలో ఒకేషనల్ గ్రూప్‌లో స్పాట్ అడ్మిషన్లు

జోగిపేట, జూలై26: ఇంటర్మీడియేట్ మొదట సంవత్సరం వొకేషనల్ గ్రూప్‌లో అడ్మిషన్ల కోసం...అందోలులోని ఎస్సీ గురుకుల కళాశాలలో గురుకులం జోనల్ అధికారి భీమయ్య ఆధ్వర్యంలో శుక్రవారం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు. మెదక్ రీజియన్ పరిధిలోని పలు గురుకులాలకు సంబంధించి మిగిలిపోయిన సీట్లకు గానూ ఈ అడ్మిషన్లను నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో అందోలు, మెదక్; హత్నూర గురుకులాల ప్రిన్సిపాళ్లు సద్గుణ మేరీ గ్రేస్, స్వర్ణలత, సూపరింటెండెంట్ గంగాధర్‌స్వామి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎరువుల విక్రయం జరగాలి

కల్హేర్, జూలై 26: ఎరువుల విక్రయ దుకాణాల్లో ఎరువుల విక్రయాలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ పేర్కొన్నారు. శుక్రవారం కల్హేర్‌లోని ఆగ్రోస్ సేవా కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులు పరిశీలించి ఎరువులు, విత్తనాలు నిబంధనల ప్రకారం విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. ఎన్ని విక్రయ లైసెన్సులు ఉంటే అన్ని దుకాణాలు, గోడౌన్‌లు వేర్వేరుగా ఏర్పాటు చేసుకోవాలని ఆమె వ్యాపారులకు సూచించారు.

● చిలప్‌చెడ్, జూలై 26: ఎరువులు, పురుగుల మందులు కొన్న వెంటనే వినియోగ దారులకు రసీదులు తప్పని సరిగా ఇవ్వాలని ఏడిఏ పుణ్యవతి సూచించారు. శుక్రవారం మండలంలోని చండూరు గ్రామంలో గల ఫర్టిలైజర్ షాప్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించారు. వెంట ఏవో బాల్‌రెడ్డి, ఏఈవో భూపాల్, షాప్ నిర్వాహకుడు వెంకటేశం ఉన్నారు.

ఎమ్మెల్యే మాణిక్‌రావును పరామర్శించిన గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్, జూలై 26: జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు వారం రోజులుగా ఫుడ్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతు హైదరాబాద్‌లోని యశోదాఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాష్ట్ర సెట్విన్‌కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి శుక్రవారం యశోదాస్పత్రికి వెళ్లి, పరామర్శించి ఆయన ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేల చూడాలని ఆయన వైద్యులను కోరినట్లు సమాచారం. ఆయన వెంట రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధం ఉజ్వల్ రెడ్డి, నాయకులు గడీల శ్రీకాంత్‌రెడ్డి, అరుణ్ తదితరులున్నారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

నామమాత్రంగా విచారణపై ప్రజల ఆగ్రహం

ఝరాసంగం, జూలై 25: మండలపరిధిలోని మాచ్నూర్ గ్రామంలో గల గ్రామకంఠంలోని ఖాళీస్థలాల్లో గ్రామానికి చెందిన కొంత మంది పేరిట ఎంపీఈవో, పంచాయతీ కార్యదర్శి ఇంటి నెంబర్లను కేటాయించడాన్ని తప్పుపడుతూ గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం గ్రామానికి విచారణ నిమిత్తం వచ్చిన డీఎల్పీవో అమృత, ఎంపీడీవో సుధాకర్ తూతూ మంత్రంగా విచారణ చేపట్టారని గ్రామస్థులు ఆరోపించారు. అక్రమాలకు తెరలేసిన అధికారులపై చర్యలు చేపట్టాలని కోరుతూ విచారణకు వచ్చిన అధికారుల ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద విచారణ చేపట్టే ప్రక్రియను ప్రారంభిస్తున్న క్రమంలో గ్రామస్థులు ప్రభుత్వ స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను వారికి వివరించారు. విచారణ అధికారులకు బాధితులకు మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సమాచారమందుకున్న ఎస్ఐ. నరేష్ సంఘటనస్థలానికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. విచారణ జరుగుతుండగా మీడియాకు అనుమతి లేదని, పూర్తి వివరాలను తర్వాత అందజేస్తామని అధికారులు గ్రామస్థులకు చెప్పారు.

ముగిసిన మున్సిపల్ దుకాణాల వేలం

మెదక్ మున్సిపాలిటీ, జూలై 26: పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద గల ఐదు మున్సిపల్ దుకాణాలకు శుక్రవారం వేలంపాట నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో రమాదేవి ముఖ్య అతిథిగా హాజరు కాగా చైర్మన్ చంద్రపాల్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. షాపు నెంబర్లు 1, 11, 12, 13, 15 ఐదు దుకాణాలకు గాను 11 దరఖాస్తులు రాగా వేలం ప్రారంభించారు. షాపు నెం. 1కి రూ.16,900, 11వ షాపుకు రూ.11,200, 12వ షాపుకు రూ.12100, 13వ షాపుకు రూ.8000, 15వ షాపుకు రూ.10,900 రూపాయలు పాడి దక్కించుకున్నారు. మొదటిసారి మార్చి మాసంలో నిర్వహించిన వేలం పాటలో పై ఐదు దుకాణాలకు రూ. 2,00,400 ఆదాయం రాగా.. తాజా వేలంలో కేవలం 59,100 మాత్రమే వేలం పలికింది. గతంతో పోలిస్తే రూ. 1,41,300 ఆదాయం తగ్గింది.

ప్రయాణికులకు సమస్యలు లేకుండా చూడాలి

మెదక్ అర్బన్, జూలై 26: ప్రయాణికులకు ఎలాంటి సమస్య లేకుండా చూడాలని మెదక్ ఆర్డీవో రమాదేవి సూచించారు. శుక్రవారం ఆమె డీఎం సురేఖ కలిసి న్యూబస్టాండ్‌ను పరిశీలించారు. బస్సుల సమయపాలన, సౌకర్యాల గురించి ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. బస్టాండ్ ప్రాంతమంతా పరిశుభ్రంగా ఉండాలని, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. దుకాణాల్లో వస్తువులను అధిక ధరకు అమ్మితే చర్యలు తీసుకుంటామని, నిర్వాహకులను హెచ్చరించారు. ఆర్డీవో వెంట తహశీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మహిళా సాధికారిత చట్టాల పై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, అధికారులు

మెదక్ కల్చరల్, జూలై 26: మండలంలోని ర్యాలమడుగు గ్రామంలో శుక్రవారం సీడ్స్ కంపెనీ మెదక్ మహిళా శిశు సంక్షేమ శాఖ మెదక్ వారి ఆధ్వర్యంలో మహిళా సాధికార చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలింగ్ రజీమున్నిసా బేగం, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిలింగ్ సిద్ధాగౌడ్, లీగల్ అడ్వైజర్ కరుణాకర్ చట్టాల గురించి ప్రజలకు వివరించారు. చైల్డ్ సేవలు, హక్కుల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో డీహెచ్ఈడబ్ల్యూ మిషన్ శక్తి స్టాఫ్, కోఆర్డినేటర్ సంతోషి జెండర్ స్పెషల్ నాగమణి, సార్ సీడ్స్ కంపెనీ యాజమాన్యం హన్మంత్ రెడ్డి, కంపెనీ మేనేజర్, మహిళలు పాల్గొన్నారు.

మునిపల్లిలో..



మాట్లాడుతున్న సీనియర్ జడ్జి రమేష్

మునిపల్లి, జూలై 26: మహిళా చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి రమేష్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్ శక్తి వంద రోజుల స్పెషల్ సంయుక్త అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని బుదేరా చౌరస్తాలో గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ జడ్జి రమేష్ హాజరై ప్రసంగించారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్, భరోసా, సఖి ఉమెన్స్‌వింగ్‌లు పని చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో రేణుక పటేల్, ఎస్ఐ రాజేష్, కళాశాల ప్రిన్సిపాల్ అరిఫా తెహసీన్, సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

రాష్ట్రప్రభుత్వ బడ్జెట్‌పై బీజేపీ నిరసనలు

నారాయణఖేడ్, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో తెలంగాణకు ఒరిగేదేమీలేదంటూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఖేడ్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని రాజీవ్ చౌక్‌లో రాష్ట్రప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణ ప్రజలకు ఇచ్చింది గాడిద గుడ్డేనని ఈ సందర్భంగా నాయకులు విమర్శించారు.


● నర్సాపూర్, జూలై 26: రాష్ట్ర బడ్జెట్‌లో మెదక్ జిల్లాకు పూర్తి అన్యాయం చేశారని నిరసిస్తు శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాన రోడ్డుపై చౌరస్తాలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళిధర్‌యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.చిన్నరమేష్‌గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను అనుకూలమైన బడ్జెట్ ప్రవేశ పెట్టకపోగా మెదక్ జిల్లాకు రూపాయి కూడా కేటాయించకుండా ఇక్కడి వారిని తీవ్ర అన్యాయం చేశారన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● గ్రామాల్లో ముమ్మరంగా వనమహోత్సవం



ఖేడ్ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కనాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి తదితరులు



వెల్దుర్తిలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఈత మొక్కలు నాటుతున్న దృశ్యం

నారాయణఖేడ్, జూలై 26: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా ఖేడ్ శివార్లలోని ఎస్టీ గురుకులంలో, మోడల్ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కాగా ఎస్టీ గురుకులంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఉపాధిహామీ ఆధ్వర్యంలో, మోడల్ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమాన్ని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించాగా ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అనంతరం ఆయా విద్యా సంస్థల విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలోమున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కమిషనర్ జగ్జీవన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● మునిపల్లి: వనమహోత్సవంలో మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించే బాధ్యత కూడా ముఖ్యమని జడ్పీ సీఈవో జానకిరెడ్డి సూచించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మేళసంగం, తాటిపల్లి గ్రామాల్లోని రోడ్డుకిరువైపులా అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. అవెన్యూ ప్లాంటేషన్, ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు పెద్ద ఎత్తున నాటాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రామాచారి, ఎంపీడీవో డాక్టర్ హరినందన్ రావు, ఏపీవో యాదగిరి, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్, మాజీ సర్పంచులు అంజిరెడ్డి, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● చిలప్‌చెడ్: వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యత అందరిపైన ఉందని డీఆర్డీవో శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాలలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం డీఆర్డీవో శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 60శాతం వరకు నాటినట్లు తెలిపారు. అనంతరం పండ్ల తోటలను పరిశీలించి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముసాదిక్, మండల ప్రత్యేక అధికారి మాన్య నాయక్, ఎంపీడీవో ఆనంద్, ఏపీవో శ్యాంకుమార్, ఏఎస్‌వో వెంకటేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● వెల్దుర్తి: మానవాళి మనుగడకు చెట్లే జీవనాధారమని రామాయంపేట ఎక్సైజ్ సీఐ రాణి అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వెల్దుర్తి కూడి చెరువు గట్టు వద్ద ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... రామయంపేట ఎక్సైజ్ శాఖ పరిధిలో 10వేల మొక్కలు నాటడమే లక్ష్యమని, ఇప్పటి వరకు 5వేలు మొక్కలు నాటామన్నారు. ప్రస్తుతం వెల్దుర్తిలో 500 మొక్కలు నాటినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ విజయసిద్ధార్థ, ఎంపీవో విష్ణేశ్వర్, ఏపీవో రాజు, నాయకులు, ఎక్సైజ్‌శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.